సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 20 । జనవరి । 2023



కారుణ్య నియామకాలు

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీలో కారుణ్య నియామకాలు జరిపారు. 14 మందికి గురువారం కమిషనర్ పి.రాజాబాబు ఉద్యోగ పత్రాలు అందజేశారు.



కనకమ్మ సన్నిధిలో జయప్రద

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): కనకమహాలక్ష్మి అమ్మవారిని సినీనటి జయప్రద గురువారం దర్శించుకున్నారు.



దారుణ హత్యపై దర్యాప్తు

కట్టుపాలెం చెరకు కాటా ఊసల మదుం వంతెన కింద మృతుడి శరీర భాగాలు దొరికిన ప్రాంతాన్ని ఎస్పీ పరిశీలించారు. ఫోరెన్సిక్ బృందం ఆధారాలు సేకరించింది. 8లో

న్యూస్‌రీల్

తాండవలో 4.20 లక్షల చేప పిల్లల విడుదల



తాండవ జలాశయంలో చేప పిల్లలు వేస్తున్న దృశ్యం

గొలుగొండ: తాండవ జలాశయంలో చేపల వేట సాగిస్తున్న మత్స్యకారులు మంచి ఆదాయం పొందాలని జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి తెలిపారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో గురువారం తాండవ జలాశయంలో 4.20 లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. ముగ్గురు జాలర్లకు మోటార్లు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ తాండవ జలాశయంపై రైతులే కాకుండా వందలాది మంది జాలర్లు ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. జాలర్ల అభివృద్ధికి మత్స్యశాఖ, ప్రభుత్వం అనేక రాయితీలపై చేప, రొయ్య పిల్లలు వేస్తున్నాయన్నారు. వీటితో జాలర్లకు మంచి ఆదాయం వస్తుందన్నారు. చిన్న పిల్లలను కాకుండా పెద్ద చేపలు పట్టుకునే విధంగా సంఘం ప్రతినిధులు చర్యలు తీసుకోవాలన్నారు. జాలర్లు పట్టుకున్న చేపలను గ్రామాల్లో అమ్ముకోవడానికి రాయితీపై మోటారుసైకిళ్లు ఇచ్చామన్నారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ జక్కు నాగమణి, సర్పంచ్ పెదిరెడ్ల లక్ష్మి, పార్టీ యూత్ అధ్యక్షుడు రామకృష్ణనాయుడు, తాండవ జలాశయం సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నక్కా రమణ, జొన్నా రాంబాబు, మత్స్యశాఖ అధికారి ఆశాజ్యోతి పాల్గొన్నారు.

వేమన పద్యాలు నిత్య సత్యాలు



యోగి వేమన చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల : ప్రజలకు మేలు కలిగించే అంశాలను తన పద్యాల ద్వారా సులభరీతిన చెప్పిన వేమన ప్రజాకవి అని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన యోగి వేమన జయంతి కార్యక్రమంలో వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆనాటి సమాజంలో ఉన్న ఛాందస భావాలను ఖండిస్తూ, తన పద్యాల ద్వారా సామాజిక చైతన్యం కలగించిన గొప్ప కవి వేమన అని కొనియాడారు. వేమన అన్ని అంశాలను స్పృశిస్తూ మంచి చెడులను విశదీకరించారన్నారు. ఆయన పద్యాలు నిత్య సత్యాలని, నేటికీ ఆచరణీయమేనని పేర్కొన్నారు. వేమన పద్యాలలో సారాన్ని గ్రహించి సామాజిక మార్పులకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఐక్య రాజ్య సమితి యునెస్కో విభాగం వారి మేటి ప్రపంచ భాషా కవుల్లో ఒకరిగా వేమనను ఎన్నుకుని, ఆయన రచనలను పలు భాషాల్లో అనువదింపచేయడం ఆయన గొప్పదనానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఎ.శ్రీనివాసరావు, అధికారులు చంద్రశేఖర్, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాల నిర్మాణ పనులపై ఆరా



ప్రాజెక్టు మేనేజర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

మాకవరపాలెం: వైద్య కళాశాల నిర్మాణ పనులపై ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ ఆరా తీశారు. భీమబోయినపాలెం వద్ద 52.15 ఎకరాల్లో రూ.500 కోట్లతో 630 పడకల వైద్య కళాశాల నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. గత నెల 30న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయడంతో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మండల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే గణేష్ ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణారెడ్డితో మాట్లాడారు. పనులు ఏ స్థాయిలో ఉన్నాయనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు.



రాయితీపై సరఫరా చేసిన ద్విచక్ర వాహనాలతో మత్స్యకారులు

పెంచేందుకు చేప పిల్లలు.. పెద్దవయ్యాక వాటిని తరలించేందుకు రాయితీపై ఆటోలు, మినీ వ్యాన్లు, మోపెడ్లు.. చేపలు తాజాగా ఉండేందుకు ఐస్ బాక్సులు.. ఇలా మత్స్యకారులకు కావలసిన వనరులన్నీ ప్రభుత్వం సమకూర్చడంతో గంగపుత్రుల రాతే మారిపోయింది. అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించడంతో వారి బతుకుకు భరోసా లభించింది. వారి జీవన ప్రమాణాల స్థాయి గతంలో కంటే ఎంతో మెరుగుపడింది.

మీనాలు మెరిసేలా.. లాభాలు కురిసేలా..



జలాశయంలో విడుదలకు సిద్ధం చేసిన చేప పిల్లలు (ఇన్‌సెట్) మార్కెట్‌కు తాజా చేపలను తరలించేందుకు అందించిన ఆటో

- మత్స్యకారులకు ప్రభుత్వం భరోసా
- ఈ ఏడాది జలాశయాల్లో 28.40 లక్షల చేప పిల్లల విడుదల
- చేపల రవాణాకు రాయితీపై ప్రత్యేక ఆటో, మినీ వ్యాన్, మోపెడ్ వాహనాల పంపిణీ

దేవరాపల్లి: మత్స్యకారులకు మంచి రోజులు వచ్చాయి. వారి ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాల ద్వారా రాయితీలను అందజేస్తున్నాయి. మత్స్య సంపదను మరింత అభివృద్ధి చేసి మత్సకారుల జీవనోపాధిని మెరుగుపరచడమే ధ్యేయంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న అండదండలు వారికి ఎంతో మేలు చేస్తున్నాయి. తాండవ, రైవాడ జలాశయాలు, కొండకర్ల ఆవలో ఈ ఏడాది 28.40 లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) స్కీమ్ ద్వారా తాండవ, రైవాడ రిజర్వాయర్లలో, స్వచ్ఛంద సంస్థ సహకారంతో కొండకర్ల ఆవలో వీటిని విడిచిపెట్టడం మత్స్యకారులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంది. 'రైవాడ'లో 9 లక్షలు, 'తాండవ'లో 9.40 లక్షలు, కొండకర్ల ఆవలో 10 లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. వీటిపై 800 మంది మత్స్యకారులు ఆధారపడి జీవిస్తున్నారు. తక్కువ కాలంలో ఎదిగే బొచ్చె, రాగండి, ఎర్రమైల రకం చేప పిల్లలను సరఫరా చేశారు.

జిల్లాలో 54 మత్స్యకార సొసైటీలు ఉండగా వీటి పరిధిలో 9,344 మంది మత్స్యకారులు ఉన్నారు. ఇన్‌లాండ్ (స్వదేశీ మత్స్యకార సంఘాలు) సొసైటీలు 20, మెరైన్ (సాగర మత్స్యకార సంఘాలు) సొసైటీలు–20, మహిళా మత్స్యకారుల కోఆపరేటివ్ సొసైటీలు 14 ఉన్నాయి.

మత్సకారులకు రాయితీపై వాహనాలు

జలాశయాల్లో పట్టుకున్న చేపలను సకాలంలో మార్కెట్‌కు తరలించేందుకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన స్కీమ్‌లో భాగంగా రాయితీపై టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోపెడ్ వాహనాలతోపాటు చేపల నిల్వకు ప్రత్యేకంగా రూపొందించిన మూడు చక్రాల ఆటో, మినీ వ్యాన్‌లను అందజేస్తున్నారు. జిల్లాలోని అచ్యుతాపురం, చోడవరం, వి.మాడుగుల, దేవరాపల్లి, కె.కోటపాడు, చీడికాడ, గొలుగొండ, నక్కపల్లి మండలాలకు చెందిన 28 లబ్ధిదారులైన మత్సకారులకు మోపెడ్లతోపాటు ఐస్ బాక్స్‌లను ఇటీవల అందజేశారు. దీని యూనిట్ ధర రూ.75 వేలుగా ప్రభుత్వం నిర్ణయించింది. బీసీలకు 40 శాతం సబ్సిడీపైన, ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం సబ్సిడీపైన అందజేశారు. ప్రభుత్వ రాయితీ పోను బీసీలు రూ.45 వేలు, ఎస్సీ, ఎస్టీలు రూ.30 వేలు చెల్లించాలి. ఇదే స్కీమ్‌లో ఇన్సులేటెడ్ వెహికల్స్‌ను బ్యాంక్ లింకేజీ ద్వారా రాయితీపై అందజేస్తున్నారు.

ఇదే స్కీమ్‌లో ఆటో యూనిట్ ధర రూ.3 లక్షలు కాగా జనరల్ కేటగిరీ చెందిన వారికి 40 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం రాయితీపైన అందజేస్తున్నారు. మినీ వ్యాన్ యూనిట్ ధర రూ.20 లక్షలు కాగా బీసీలకు 40 శాతం రాయితీ రూ.8 లక్షలు, ఎస్సీ, ఎస్టీ మహిళలకు 60 శాతం రాయితీ రూ.12 లక్షలు వర్తిస్తుందని మత్స్యశాఖ అధికార్లు తెలిపారు. ఎస్.రాయవరంలో బీసీ కేటగిరికి చెందిన మత్స్యకారుడికి రూ.8 లక్షల రాయితీపై వాహనాన్ని అందజేసినట్లు ఆశాఖ అధికార్లు వెల్లడించారు.

ఆనందంగా ఉన్నాం



రైవాడ జలాశయంలో ఈ ఏడాది రెండు విడతల్లో 9 లక్షల చేప పిల్లలు విడుదల చేశారు. మొదటి విడతలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చేతుల మీదుగా విడుదల చేశారు. అదనంగా చేప పిల్లలు విడుదల చేయాలని కోరడంతో డిప్యూటీ సీఎం చొరవతో రెండో విడతగా 3 లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. మత్స్యకారులమంతా ఆనందంగా ఉన్నాం.

–ఉగ్గిన రవి, మత్స్యకారుడు, రైవాడ, దేవరాపల్లి మండలం

అన్ని విధాలుగా ఆదుకుంటున్నారు



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మత్స్యకారులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తోంది. రాయితీపై మోపెడ్ వాహనాన్ని అందజేశారు. వాహనంతోపాటు చేపలు తరలించేందుకు ఐస్ బాక్స్‌ను అందజేశారు. ఈ వాహనం మాకు ఎంతగానో ఉపయోగపడుతోంది.

–సలుగు సాంబమూర్తి, మత్స్యకారుడు, కోనాం

గంగపుత్రులకు అండదండగా..



రైవాడ, తాండవ, కొండకర్ల ఆవలో ఈ ఏడాది 28.40 లక్షల చేప పిల్లలను విడుదల చేశాం. లైసెన్స్ కల్గిన ప్రతి మత్స్యకారుడికి నెలకు సుమారు 10 వేల నుంచి 15 వేల వరకు ఆదాయం వచ్చే విధంగా చేప పిల్లలను విడుదల చేశాం. చేపలను మార్కెట్‌కు తరలించేందుకు గాను జనరల్ కేటగిరి మత్స్యకారులకు 40 శాతం, ఎస్సీ, ఎస్టీ మత్స్యకారులకు 60 రాయితీపై ద్విచక్ర మోటారు సైకిల్, మూడు చక్రాల ఆటో, మినీ వ్యాన్‌లను సరఫరా చేస్తున్నాం. లైసెన్స్ కల్గిన మత్స్యకారుడు వేట సమయంలో మరణిస్తే 5 లక్షల ప్రమాద బీమా సదుపాయం ప్రభుత్వం కల్పించింది.

–పి.లక్ష్మణరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి, అనకాపల్లి

కుంచంగి ఎంపీటీసీ సభ్యుడి మృతి



శివ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మంత్రి అమర్‌నాథ్, గొర్లి సూరిబాబు (ఇన్‌సెట్) కుంచంగి ఎంపీటీసీ శివ సత్యం దొర (ఫైల్)

అనకాపల్లి రూరల్: కుంచంగి ఎంపీటీసీ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పల్లెల శివ సత్యం దొర (54) గురువారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విశాఖలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, మండలానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం రాత్రి కుంచంగి వెళ్లి శివ సత్యం దొర భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించి తమ సానుభూతిని తెలియజేశారు. శివ సత్యం దొర ఉమ్మడి విశాఖ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, అనకాపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా, సత్యనారాయణపురం సత్యనారాయణస్వామి దేవస్థానం ఛైర్మన్‌గా అనేక పదవులు చేపట్టారు. ఆయన భార్య కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. కుమార్తె కుసుమ వివాహం నిశ్చయమైంది. త్వరలో పెళ్లి జరగనున్న సమయంలో ఆయన మృతి చెందడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఎంపీటీసీ మృతి పట్ల కుంచంగి, సుందరయ్యపేట, వెంకుపాలెం సర్పంచ్‌లు పల్లెల నాగలక్ష్మి, బాదపు తాతారావు, రాపేటి నాగేశ్వరరావు, కుంచంగి మాజీ సర్పంచ్ పల్లెల బాబూజీ, గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతాపాన్ని తెలియజేశారు. ఎంపీటీసీ భౌతిక కాయానికి శుక్రవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

కానిస్టేబుళ్ల రాత పరీక్షకు నిమిషం నిబంధన

దొండపర్తి (విశాఖ దక్షిణ): పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీస్ కానిస్టేబుళ్ల నియామక రాత పరీక్షకు పోలీస్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో 97 పరీక్షా కేంద్రాల్లో ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాత పరీక్ష జరగనుంది. ఈ పరీక్షకు 41,435 మంది పురుష అభ్యర్థులు, 13,338 మంది మహిళా అభ్యర్థులు మొత్తంగా 54,772 మంది హాజరుకానున్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు పోలీస్ కమిషనర్ సి.హెచ్.శ్రీకాంత్ పలు సూచనలు చేశారు.

వినియోగదారుల ప్రయోజనాలే ముఖ్యం

- 2023–24లో విద్యుత్ టారిఫ్‌లలో మార్పులు లేవు
- ప్రారంభమైన ఏపీఈఆర్సీ ప్రజాభిప్రాయ సేకరణ
- తొలిరోజున అభిప్రాయాలు తెలిపిన 20 మంది



అభిప్రాయాలు తీసుకుంటున్న ఏపీఈఆర్సీ ఛైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, సభ్యులు ఠాకూర్ రామ్‌సింగ్, పి.రాజగోపాల్ రెడ్డి, హాజరైన డిస్కంల అధికారులు

సాక్షి, విశాఖపట్నం: వినియోగదారుల ప్రయోజనాలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ పంపిణీ సంస్థలు కీలక నిర్ణయాలు తీసుకున్నాయి. 2023–24 ఆర్థిక సంవత్సరంలో గృహ విద్యుత్ వినియోగదారులపై ఛార్జీల పెంపునకు డిస్కంలు ఎలాంటి ప్రతిపాదనలు చేయలేదు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ప్రజాభిప్రాయ సేకరణ గురువారం నగరంలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ప్రారంభమైంది. ఏపీఈఆర్సీ ఛైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, సభ్యులు ఠాకూర్ రామ్‌సింగ్, పి.రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభమైన ప్రజాభిప్రాయ సేకరణలో ఆయా డిస్కంల సీఎండీలు తమ ప్రతిపాదనల నివేదికను ఈఆర్సీ ముందుంచారు. ఛైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ వినియోగదారుల ప్రయోజనాలను కాపాడుతూ, విద్యుత్ సంస్థల ఆర్థిక శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని సమతూకం ఉండేలా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి నిర్ణయాలను తీసుకొంటుందన్నారు. ఉచిత వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి సీనియారిటీ జాబితాను పారదర్శకంగా ఉండేలా డిస్కమ్‌లు తమ వెబ్‌సైట్లలో కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ప్రచురిస్తున్నాయని తెలిపారు. విద్యుత్ ఆదా చేసే పరికరాలను వినియోగించడంలో వినియోగదారుల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ఇంధన సమర్థవంతమైన లైట్లు, ఎయిర్ కండిషనర్లు, సూపర్ ఎఫిషియంట్ ఫ్యాన్లను తగ్గింపు ధరలకు గృహ విద్యుత్ వినియోగదారులకు ముందస్తు చెల్లింపు ద్వారా లేదా ఆన్–బిల్ ఫైనాన్సింగ్ ఎంపికపై అందించే పైలట్ ప్రాజెక్ట్ ను కమిషన్ ఆమోదించిందని వెల్లడించారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని స్పష్టం చేశారు. పారిశ్రామిక యూనిట్లను మూసివేసిన కాలంలో కనీస ఛార్జీల భారాన్ని నివారించేందుకు సిక్ ఇండస్ట్రియల్ పాలసీని పునరుద్ధరించినట్లు వెల్లడించారు.



ప్రతిపాదనలను వివరిస్తున్న ఈపీడీసీఎల్ సీఎండీ సంతోషరావు

డిస్కంల ఆర్థిక పరిస్థితిపై దృష్టి సారించండి..

డిస్కమ్‌లకు రావల్సిన సబ్సిడీలు పూర్తిస్థాయిలో రాకపోవడం కారణంగానే వాటి ఆర్థిక పరిస్థితులు మెరుగుపడటం లేదని వివిధ వర్గాల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. తొలి రోజున 20 మంది తమ అభిప్రాయాలను ఈఆర్సీకి తెలిపారు. పునరుత్పాదక ఇంధన వనరులు మన డిమాండ్‌ని తీర్చలేవని డిస్కమ్‌లు అంగీకరించిన నేపథ్యంలో వాటిని ప్రోత్సహించడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు విద్యుత్ రంగాన్ని హైజాక్ చేస్తూ నాశనం చేస్తున్నాయనీ.. దీన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ఏపీఈఆర్సీ నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. విజిలెన్స్ వ్యవస్థని పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఫెర్రో అల్లాయిస్ కంపెనీలకు డిమాండ్ ఛార్జీలు పెంచడం మొదలైన నిర్ణయాలు ఆ రంగాన్ని నిర్వీర్యం చేసేటట్లుగా ఉన్నాయనీ.. డిస్కంలు చేసిన ఈ ప్రతిపాదనని ఆమోదించవద్దని ఫ్యాప్సీ ప్రతినిధులు కోరారు.

అనకాపల్లి నుంచి..

అనకాపల్లి టౌన్: గవరపాలెం విద్యుత్ కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు చర్చలో పాల్గొన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ పూర్తిస్థాయిలో అందించాలన్నారు. వ్యవసాయ బోర్ల విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసినా సిబ్బంది సకాలంలో స్పందించడం లేదని పేర్కొన్నారు. డీఈ రమణమూర్తి పాల్గొన్నారు.



వర్చువల్ విధానంలో పాల్గొన్న డీఈ రమణమూర్తి

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు

- రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎస్పీ గౌతమి సాలి

తుమ్మపాల: జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీస్, రవాణా అధికారులు చేపట్టిన చర్యల కారణంగా డిసెంబర్ నెలలో ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయన్నారు. అదే స్ఫూర్తితో మరిన్ని చర్యలు చేపట్టాలన్నారు. ఈ ఏడాది ప్రమాదాలు 40 శాతానికి తగ్గించాలనే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభించనున్న అనకాపల్లి –రాజమండ్రి జాతీయ రహదారి విస్తరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ముందుగానే తెలియజేయాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు జిల్లాలో రోడ్లను పరిశీలించి భద్రతాపరమైన చర్యలను తెలపాలన్నారు. సూచికలు, హెచ్చరిక బోర్డులు, స్టాపర్ స్టాండ్స్, రేడియం స్టిక్కర్స్, వంటివి ఏర్పాటు చేసేందుకు సీఎస్ఆర్ నిధులు వినియోగించుకోవాలని సూచించారు. రహదారి భద్రత అంశాలపై ఎన్జీవోల సహకారంతో గ్రామాలు, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

ఎస్పీ గౌతమి సాలి మాట్లాడుతూ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఈ ప్రక్రియలో జిల్లాలో రోడ్లపై 37 బ్లాక్ స్పాట్‌లను గుర్తించామన్నారు. ముఖ్యమైన కూడళ్లలో అక్రమణలను తొలగించడం, అప్రోచ్ రోడ్లకు స్పీడ్ బ్రేకర్లు వేయడం, అవసరమైన చోట్ల సీసీ కెమేరాలు, స్పీడ్ గన్స్, నిర్దేశిత ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. తాళ్లపాలెం, లంకెలపాలెం, అనకాపల్లి బైపాస్, కశింకోట వంటి ప్రాంతాలలో ప్రజలను, పోలీసులను అప్రమత్తం చేసినట్టు తెలిపారు. తద్వారా ప్రమాదాలు తగ్గుముఖం పట్టి, మంచి ఫలితాలు సాధించామన్నారు. రోడ్డుకు ఇరువైపులా చెట్లకు రేడియం స్టిక్కర్లు అతికించాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. జిల్లా రవాణా అధికారి ఎం.వీర్రాజు ట్రాఫిక్ నియంత్రణకు చేపట్టిన ఏర్పాట్లు, ఇక ముందు తీసుకునే చర్యలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రోడ్డు భద్రత కమిటీ సూచనలు, సలహాల మేరకు ప్రమాదాల నివారణకు మరిన్ని చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పి.వెంకటరమణ, ఎన్‌హెచ్‌ఏఐ పీడీ శివశంకర్, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తలు తప్పనిసరి



మాట్లాడుతున్న సీనియర్ శాస్త్రవేత్త నర్సింహారావు

మాకవరపాలెం: సైబర్ నేరాలపై అందరూ జాగ్రత్తగా ఉండాలని సీనియర్ శాస్త్రవేత్త నర్సింహారావు విద్యార్థులకు సూచించారు. మండలంలోని తామరం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం సాయంత్రం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్లను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రిన్సిపాల్ మోహన్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రమాదవశాత్తూ మేడపై నుంచి పడి అటెండర్ మృతి


మృతుడు రాజు నాయుడు(ఫైల్)

నర్సీపట్నం : నర్సీపట్నం పంచాయతీ రాజ్ కార్యాలయంలో అటెండర్‌గా పని చేస్తున్న ఎం.రాజునాయుడు(57) ప్రమాదవశాత్తు మేడపై నుండి పడి మృతి చెందారు. పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. కార్యాలయం అవరణలో ఏపుగా పెరిగిన బూరుగు వృక్షాలను తొలగించే సమయంలో గురువారం ఈ సంఘటన జరిగింది. నరికిన చెట్లు కార్యాలయంపై పడకుండా పక్కకు పడేందుకు వీలుగా చెట్టుకు తాడు కట్టి ఆ తాడును స్లాబ్‌పై పిల్లర్‌కు కట్టారు. కూలీలు చెట్టు నరుకుతుండగా అటెండర్ పిల్లర్ కట్టిన తాడును పట్టుకుని లాగుతున్నారు. నరికిన చెట్టు బలంగా పక్కకు లాగడంతో అటెండర్ తూలి మేడపై నుండి కిందపడిపోయారు. తలకు బలమైన గాయం కావడంతో కార్యాలయ సిబ్బంది అతనిని సమీపంలోని ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయాడు. టౌన్ ఎస్ఐ గోవిందరావుకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దారుణ హత్యపై దర్యాప్తు

- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ గౌతమి సాలి
- త్రీడీ స్కానర్‌తో ఫోరెన్సిక్ బృందం దర్యాప్తు
- హతుడి మరో కాలు, చెయ్యి లభ్యం


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ గౌతమి సాలి

యలమంచిలి : యలమంచిలి పట్టణ పరిధిలో కట్టుపాలెం చెరకు కాటా ఊసల మదుం వంతెన కింద బయటపడిన వ్యక్తి దారుణ హత్యకు సంబంధించి పోలీసుశాఖ దర్యాప్తు వేగవంతం చేసింది. ఈనెల 15న వంతెన కింద ఉన్న కాలువలో వ్యక్తి తల, మొండెం,కొన్ని శరీర భాగాలు వేర్వేరుగా లభించిన సంగతి తెలిసిందే. గుర్తు తెలియని వ్యక్తిని కొందరు అతి కిరాతకంగా శరీర భాగాలు వేరు చేసి హత్యకు పాల్పడిన ఘటన ఈ ప్రాంతంలో సంచలనం కలిగించింది. ఈ దారుణ హత్య మిస్టరీని ఛేదించడానికి పోలీసు ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో హంతకులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటివరకు హత్యకు సంబంధించిన కీలకమైన ఆధారాలేమి లభించకపోవడంతో గురువారం హతుడి శరీర భాగాలు బయటపడిన ప్రాంతాన్ని అనకాపల్లి ఎస్పీ గౌతమి సాలి , ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ బృందం పరిశీలించారు. త్రీడీ స్కానర్‌తో హత్యకు సంబంధించిన ఆధారాల కోసం అన్వేషించారు. యలమంచిలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షేక్ గఫూర్, ఎస్ఐ కె.సన్నిబాబు హత్యకు సంబంధించి ఇప్పటివరకు సేకరించిన వివరాలను ఎస్పీకి తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు ముమ్మరంగా చేపడుతున్నామని వీలైనంత త్వరగా మిస్టరీని ఛేదిస్తామని ఎస్పీ తెలిపారు.

మరో కాలు, చెయ్యి లభ్యం

హతుడి శరీర భాగాలు గుర్తించిన ప్రదేశంలో వెతికించగా హత్యకు గురయిన వ్యక్తికి సంబంధించిన మరో కాలు, చెయ్యి భాగాలు లభించాయి. ఇప్పటికే వెలికితీసిన హతుడి శరీర భాగాలను అనకాపల్లి మార్చురీలో భద్రపరిచి గురువారం లభించిన కాలు చెయ్యి శరీర భాగాలను కూడా అనకాపల్లి మార్చురీ లోనే భద్రపరిచి ఉంచుతామని పోలీసులు తెలిపారు. మరోవైపు హతుడి తల భాగం ఆధారంగా రూపొందించిన ఛాయా చిత్రాన్ని రాష్ట్రంలో ఉన్న అన్ని పోలీస్‌స్టేషన్లకు పంపించారు. ఆయా పోలీస్‌స్టేషన్లలో నమోదయిన వ్యక్తుల అదృశ్యం కేసుల వివరాలు ఆధారంగా ఈ హత్య కేసును ఛేదించే పనిలో పోలీసులు ఉన్నారు.


త్రీడి స్కానర్ సహాయంతో ఆధారాలు సేకరిస్తున్న దృశ్యం

టీడీపీ నుంచి 40 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక


వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులతో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

- సాదరంగా పార్టీలోకి ఆహ్వానించిన డిప్యూటీ సీఎం బూడి

మాడుగుల: మండలంలో ఎల్. పొన్నవోలు పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు గ్రామ సర్పంచ్ వేగేసిన ప్రభాకరరాజు (చిన్ని), వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ గండి పడాల శ్రీనివాసరావు, పార్టీ అధ్యక్షుడు జోగాడ లక్ష్మణరావుల ఆధ్వర్యంలో గురువారం దేవరాపల్లి మండలం తారువ క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సమక్షంలో చేరారు. టీడీపీ నుంచి చేరిన వారిలో మాజీ సర్పంచ్ ఎదిరి ఈశ్వరరావు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎదిరి అప్పారావు, 4, 5వ వార్డు మెంబర్లు కోన చిలుకమ్మ, రాజాన పైడి తల్లమ్మ, పాల సంఘం డైరెక్టర్లు రాజాన అప్పారావు, చామంతుల కృపరాజు, పాల సంఘం మాజీ అధ్యక్షుడు చామంతుల చిన్నబ్బాయి, మాజీ డైరెక్టర్లు రాజాన సోమరాజు, సియ్యాద్రి చిన్నారావులతోపాటు 31 కుటుంబాలకు చెందిన వారు ఉన్నారు. వీరికి పార్టీ కండువాలు కప్పి డిప్యూటీ సీఎం సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని, ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎదిరి అప్పారావు, ఎదిరి ఈశ్వరరావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలతోపాటు గ్రామాభివృద్ధిని చూసి పార్టీలో చేరామన్నారు. జాలంపల్లి సర్పంచ్ దారా మల్లేశ్వరి చిన్ని, మాజీ వార్డు మెంబరు గొర్లి అప్పలనాయుడు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు

- ఉద్యోగ నియామక పత్రాలు అందజేసిన నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్


శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉద్యోగ నియామక ప్రతాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: నైపుణ్య శిక్షణతో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు పొందవచ్చని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వం స్కిల్ హబ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇక్కడ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి వివిధ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తూ గురువారం ఆయన నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి బ్యాచ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 30 మందిలో 23 మంది యువతీ యువకులకు వివిధ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. మిగిలిన వారికి వారంలో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో స్కిల్ హబ్ ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందన్నారు. మెగా జాబ్ మేళాలను ఏర్పాటు చేయాలని నైపుణ్య సంస్థ అధికారులకు సూచించారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఛాముండేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి అవకాశాలను మరింత మెరుగుపరిచేందుకు వీలుగా యలమంచిలి, పాయకరావుపేట, చోడవరం, మాడుగులలో స్కిల్ హబ్ సెంటర్లను త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్లు తమరాన అప్పలనాయుడు, గొలుసు నర్సింహమూర్తి, పార్టీ పట్టణాధ్యక్షుడు ఏకా శివ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎ.రాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పశు వైద్యశాఖ రాయితీలతో ప్రయోజనం

- వ్యవసాయ శాఖ జేడీ ప్రసాద్


జేడీపేటలో పశువైద్య శిబిరం ప్రారంభిస్తున్న వ్యవసాయ శాఖ జేడీ ప్రసాద్, వైస్ ఎంపీపీ రాజారామ్, సర్పంచ్ కృష్ణమూర్తి

మాడుగుల : ప్రభుత్వం పశువైద్యశాఖ ద్వారా ఎన్నడూ లేని విధంగా అందిస్తున్న రాయితీలు ప్రతి పాడి రైతు సద్వినియోగం చేసుకుని అధిక లాభాలు పొందాలని జిల్లా పశువైద్య శాఖ సంయుక్త సంచాలకుడు బి.ప్రసాద్ అన్నారు. మండలంలో జేడీపేట గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత పశు గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా రాయితీలపై అందిస్తున్న సంపూర్ణ మిశ్రమ దాణా, సెక్స్ సార్టెడ్ సెమన్‌లు వినియోగంతోపాటు మినరల్ మిక్చర్ మందులు, ఎదకు రాని పశువుల గురించి రైతులకు పూర్తి స్థాయిలో వివరించారు. వైస్ ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకట రాజారామ్, సర్పంచ్ కొసిరెడ్డి కృష్ణమూర్తి చొరవతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 36 ఎదకురాని పశువులకు, 21 చూడి పశువులకు, 60 పాడి పశువులకు, 204 గొర్రెలు, మేకలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ బి.రామ్మోహనరావు, సహాయ సంచాలకులు వి. చిట్టినాయుడు, పశువైద్యాధికారులు మణిలక్ష్మణ్, భానుబాబు, బి.సంధ్య, జి.నూకేశ్వరరావు, అరుణకుమార్, వీఎల్‌వో సత్యం, పశువైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అదృశ్యమైన యువకుడు బావిలో పడి మృతి


నర్సింహమూర్తి

కె.కోటపాడు : అదృశ్యమైనట్టు భావిస్తున్న దాలివలస గ్రామానికి చెందిన ఆదిరెడ్డి నర్సింహమూర్తి(22) గురువారం గ్రామం సమీపాన గల కొండ దిగువన గల బావిలో శవమై కనిపించాడు. ఈ నెల 17 నుంచి ఇంటి నుంచి వెళ్లిపోయిన నర్సింహమూర్తి ఆచూకీ కోసం కుటుంబసభ్యులు, స్నేహితులు వెతకడంతో పాటు ఎ.కోడూరు పోలీస్‌స్టేషన్‌లో సోదరుడు పూర్ణచంద్రరావు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో బావిలో నర్సింహమూర్తి శవమై నీటిపై తేలియాడడం చూసిన స్థానికులు సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు. ఇటీవల కాలంలో నర్సింహమూర్తికి మతి స్థిమితం సక్రమంగా లేదని సోదరుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలోనే బావిలో పడి నర్సింహమూర్తి మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతిపై కె.కోటపాడు ఎస్.ఐ ధనుంజయ్ కేసును నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. అనకాపల్లి ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం పూర్తి చేసి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. పెద్ద కుమారుడు నర్సింహమూర్తి మృతితో తల్లిదండ్రులు తాతంనాయుడు, దేముడమ్మ బోరున విలపించడంతో స్థానికులను కంటతడి పెట్టించింది.

జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు దీపక్ చక్రి


పోటీలకు ఎంపికైన విద్యార్థి దీపక్

పాయకరావుపేట : ఈ నెల 13, 14 వ తేదీలలో విజయవాడ జిల్లా గన్నవరం జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో జరిగిన 44 వ రాష్ట్ర స్థాయి జూనియర్ (బాలుర) హ్యాండ్ బాల్ పోటీలలో శ్రీ ప్రకాష్ విద్యార్థి జి.దీపక్ చక్రి (10 వ తరగతి) అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికై, ఈ నెల 26 నుండి 31 వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రం తిరుచురాపల్లి లో జరిగే 44 వ జూనియర్ (బాలుర) జాతీయ స్థాయి పోటీలలో పాల్గొననున్నాడని ప్రధానోపాధ్యాయుడు డి.వి.శ్రీనివాస్ తెలియజేశారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని విద్యా సంస్థల అధినేత నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి, కోచ్‌లు బాలరాజు, సురేష్ అభినందించారు.

జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీ విజేత 'నర్సయ్యపేట'


కలిగొట్లలో పరుగులు తీస్తున్న ఎడ్లు

దేవరాపల్లి: మండలంలోని కలిగొట్లలో జిల్లా స్థాయి ఎడ్ల పోటీలు హోరాహోరీగా సాగాయి. ఇక్కడ పైడిమాంబ తీర్థం పురస్కరించుకుని గురువారం నిర్వహించిన ఈ పోటీల్లో నర్సయ్యపేట ముమ్మిన రామకృష్ణ ఎడ్లు విజేతగా నిలిచాయి. ఇందులో జిల్లా వ్యాప్తంగా 15 ఎడ్ల బళ్లు పాల్గొనగా, సర్పంచ్ గొర్రుపోటు సుధారాణి, పార్థసారథి దంపతులు జెండా ఊపి ప్రారంభించారు. నర్సాపురం సంపత్ వినాయక ఎడ్లు ద్వితీయ, నర్సయ్యపేట సిద్ధి వినాయక ఎడ్లు తృతీయ, అర్జునగిరి మరిడిమాంబ ఎడ్లు చతుర్ధ, దేవరాపల్లి జై వీరాంజనేయ ఎడ్లు ఐదు, చుక్కపల్లి అద్దేపల్లి పాలవెల్లి ఎడ్లు ఆరు, సింగవరం సత్యం ఎడ్లు ఏడో స్థానాల్లో నిలిచాయి. విజేతలుగా నిలిచిన వీరికి వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.5 వేలు, రూ.3 వేల చొప్పున బహుమతులను వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, సర్పంచ్ సుధారాణి, గ్రామ పెద్దలు, విరాళ దాతలు అందజేశారు. అంతకు ముందు అమ్మవారిని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

దేవుడి మాన్యం భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు

దేవరాపల్లి: మారేపల్లి రెవెన్యూ పరిధిలోని దేవుడి మాన్యం భూములు అన్యాక్రాంతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా దేవదాయ, ధర్మదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ బుద్ధ మహలక్ష్మీ నగేష్ స్పష్టం చేశారు. మారేపల్లిలోని ఎండోమెంట్ భూములను ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, స్థానిక వీఆర్‌ఏతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. మారేపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 115తోపాటు మరో ఏడు సర్వే నెంబర్ల పరిధిలో మొత్తంగా 43.12 ఎకరాల దేవుడి మాన్యం భూమి ఉన్నట్లు తమ రికార్డుల ఆధారంగా ప్రాథమికంగా గుర్తించామన్నారు. ఈ భూమిలో ఫలతోటలు ఉన్నట్లు గుర్తించామని, ఆక్రమణలో ఉన్న వ్యక్తులను గుర్తించి వారికి నోటీసులు ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కు ఆదేశించామన్నారు.

రైస్ పుల్లింగ్ ముఠా గుట్టురట్టు

- బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి పోలీసులు
- ముగ్గురు అరెస్టు
- మూడు కార్లు, రూ.7,87,500 నగదు, కత్తి స్వాధీనం
- మిగతా నిందితులను పట్టుకుంటాం: చింతపల్లి ఏఎస్పీ ప్రశాంత్ కిషోర్


పట్టుబడిన నిందితులతో ఏఎస్పీ ప్రతాప్ కిషోర్, ఎస్‌ఐలు

చింతపల్లి రూరల్: ఏజెన్సీలో రైస్ పుల్లింగ్ పేరుతో ప్రజలను మోసం చేస్తున్న ముఠాలో కొంతమందిని అరెస్టు చేశామని చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ కిషోర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం ఆయన వెల్లడించారు.

రూ.కోట్లు సంపాదించవచ్చని ఆశ చూపుతూ..

అరకులోయ మండలం చినబలడ పంచాయతీ మాలసింగారం గ్రామానికి చెందిన వంతల పూర్ణ, వంతల బాజీనుద్దీన్, వంతల మనోజ్, పొట్టి రామదాసు, ప్రమోద్‌తో పాటు చింతపల్లి మండలం లోతుగెడ్డ పంచాయితీ తురంతంపాడు గ్రామానికి చెందిన కొర్ర ప్రేమ్ కుమార్ తదితరులు పురాతన నాణేలు అమ్ముతున్నామని, వాటిని తిరిగి అమ్ముకుంటే రూ.కోట్లు సంపాదించవచ్చని ఆశ చూపిస్తున్నారు.

పథకం ప్రకారం ఎరవేసి..

తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేట మండలం మన్యంవారిపాలెం గ్రామానికి చెందిన కసిరెడ్డి రాజేశ్వరరావుకు ఎరవేశారు. దీంతో సోమవారం రాజేశ్వరరావుతో పాటు అతని పార్టనర్లు చిన్న అప్పారావు, వసంత్‌కుమార్ కలసి తురుంపాడు గ్రామంలో ఉన్న కొర్ర ప్రేమ్‌కుమార్ ఇంటికి నాణెం కొనేందుకు రూ.8 లక్షలు తీసుకుని వెళ్లారు. ఈ విషయం అతను ముఠా సభ్యుడైన పూర్ణకు తెలపడంతో పథకం రచించాడు. వెంటనే ముఠాలో సభ్యులైన మనోజ్, ప్రమోద్, బుజ్జిని కారులో లోతుగెడ్డ జంక్షన్ సమీపంలోకి పంపించి ఉంచాడు. వారిలో ప్రమోద్, బుజ్జి పోలీసు యూనిఫాం ధరించారు. ఆ తరువాత పూర్ణ, ముఠా సభ్యుడు రామదాసు మరో కారులో ప్రేమ్‌కుమార్ ఇంటికి వెళ్లారు. అక్కడినుంచి వారు లోతుగెడ్డ సమీపంలో వేచి ఉన్న సభ్యుల వద్దకు కారులో బయలుదేరారు. కొంత దూరం వచ్చేపరికి ప్రమోద్, బుజ్జిలు నాణెం కొనుక్కొనేందుకు వచ్చిన వారి కారును ఆపారు. తాము పోలీసులమని చెప్పి, కారు రికార్డులు చూపించమని అడిగారు. అదే సమయంలో ముఠా సభ్యులంతా ఏకమై వారిని చుట్టుముట్టారు. చంపేస్తామని కత్తితో బెదిరించి వారి నుంచి 7,87,500 నగదుతో ఉన్న బ్యాగ్‌ను లాక్కొన్నారు. రాజేశ్వరరావు కారు తాళాలను తుప్పల్లో పడేసి అక్కడి నుంచి పరారయ్యారు.

బాధితుడి ఫిర్యాదుతో..

బాధితుడు రాజేశ్వరరావు బుధవారం చింతపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ముఠా సభ్యుల కదలికలపై నిఘా పెట్టారు. ఇంటికి వచ్చిన వెంటనే ముఠా సభ్యులైన పూర్ణ, ప్రేమ్‌కుమార్, బుజ్జిని ఎస్‌ఐలు రమణ, అరుణ్‌కుమార్ సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. వారి నుంచి మూడు కార్లు, నగదు రూ.7,87,500, కత్తి, రెండు యూనిఫాం ఫ్యాంట్లు, రాగి పురాతన నాణెంను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. ఈ కేసుతో సంబంధం ఉన్న ముఠా సభ్యుల్లో మరో ముగ్గురిని పట్టుకుంటామని ఏఎస్పీ ప్రతాప్ కిషోర్ తెలిపారు. నాణేలకు ఎటువంటి శక్తులు ఉండవని, ఇటువంటి ముఠాలను ఆశ్రయించి మోసపోవద్దని ఆయన పేర్కొన్నారు. ఎస్‌బీ ఎస్‌ఐ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

చౌక ధరల దుకాణాల తనిఖీ


మధ్యాహ్న భోజనం వంటలను పరిశీలిస్తున్న ఆహార కమిషన్ సభ్యుడు కాంతారావు

తుమ్మపాల : ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన వారందరికీ తప్పక అందాలని రాష్ట్ర ఆహార కమిటీ సభ్యుడు బి.కాంతారావు అధికారులను ఆదేశించారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో సుడిగాలి పర్యాటన చేసి, కోటివీధి, గాంధీనగర్ చౌక ధరల దుకాణాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. నిత్యావసర వస్తువుల పంపిణీపై కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందిస్తున్న సరుకులతో పాటు, అంగన్‌వాడీ, పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాలు కూడా సక్రమంగా అమలు జరగాలన్నారు. ప్రతి విద్యార్థికి పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తుందన్నారు. ఆహార పంపిణీలో ఎటువంటి నిర్లక్ష్యం చేసినా కఠిన చర్యలు తప్పవన్నారు. భీమునిగుమ్మం, గూడ్స్ షెడ్ వీధి, రైల్వే స్టేషన్ రోడ్డు, సంతోషిమాత గుడి, దాసరిగెడ్డ, గౌరీసంఘం వద్ద గల అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి పిల్లల హాజరు పట్టికలను పరిశీలించారు. జీవీఎంసీ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచి చూశారు. పిల్లలను భోజనం మెనూపై ఆరా తీశారు. ఆహార సాయాగ్రి నిల్వ గదిని పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. మెనూను పరిశీలించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం అసిస్టెంట్ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, డీఎస్‌ఓ కె.వి.ఎస్.ఎం.ప్రసాద్, ఎస్‌వోలు కళ్యాణి, నందకిషోర్, పౌరసరఫరాల అధికారులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న లారీ..తప్పిన ప్రమాదం

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం వద్ద గురువారం పెద్ద ప్రమాదం తప్పింది.నలుగురు వ్యక్తులు సురక్షితంగా ప్రమాదం నుంచి బయటపడ్డారు. కారు దెబ్బతింది. అమలాపురం నుంచి విశాఖ వెళుతున్న కారును తాళ్లపాలెం వద్ద వెనుక నుంచి లారీ వచ్చి ఢీకొంది. దీంతో కారు దెబ్బతింది. కారులో ప్రయాణిస్తున్న అమలాపురానికి చెందిన గుబ్బల వెంకటేశ్వరరావు, భార్య, కుమార్తె, కారు డ్రైవర్ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు.అమలాపురం నుంచి విశాఖలోని వెంకటేశ్వరరావు తన అత్తవారింటికి కుటుంబ సభ్యులతో వెళుతుండగా ఈ సంఘటన జరిగింది. అయితే కారు దెబ్బతింది. దీంతో ఈ సంఘటనపై బాధితుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు.

ఫ్యాషన్ టెక్నాలజీ యంత్రాల తరలింపు

కోటవురట్ల: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఫ్యాషన్ టెక్నాలజీ యంత్రాలను డీఆర్‌డీఏ అధికారులు పెందుర్తికి తరలించారు. ప్రస్తుతం ఫ్యాషన్ టెక్నాలజీ యంత్రాలున్న భవనంలో మహిళామార్టు ఏర్పాటు చేయనున్నట్టు అధికారులు తెలిపారు. కలెక్టర్ నుంచి యంత్రాలను తరలించేందుకు ఎటువంటి ఉత్తర్వులు అందలేదని, యంత్రాలను తీసుకెళ్లడానికి కుదరదని వెలుగు ఏపీఎం రమణకుమారి తొలుత అభ్యంతరం తెలిపారు. ఫ్యాషన్ టెక్నాలజీ భవనాన్ని మహిళా మార్టు ఏర్పాటు చేసేందుకు అప్పగించాలని కోరుతూ అనకాపల్లి డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతిరావు.. విశాఖ డీఆర్‌డీఏ పీడీ శోభారాణికి రాసిన లెటర్‌ను చూపించి యంత్రాలను తరలించారు. 58 ఎలక్ట్రానిక్ కుట్టుమిషన్లను పెందుర్తికి తరించినట్టు ఏపీఎం తెలిపారు.

క్లుప్తంగా

ధర తగ్గిన టమాటా

కోటవురట్ల : స్థానిక వారపు సంతలో గురువారం టమాటా ధర తగ్గింది. గత వారం కిలో రూ.20 ఉండగా, ఈ వారం రూ.15కు తగ్గింది. బంగాళాదుంపలు రూ.20, ఉల్లి రూ.25, క్యాబేజీ రూ.30, క్యారెట్, బీట్ రూట్, వంకాయ, చేమ దుంప రూ.40, బెండ, బీర, దొండ, కాకర రూ.60, క్యాప్సికం, పచ్చి మిర్చి రూ.80, బీన్స్ పిక్కలు రూ.వందకు విక్రయాలు సాగాయి.

ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోళ్లు

కోటవురట్ల : మండల రైతుల నుంచి రైతు భరోసా కేంద్రాల ద్వారా ఫిబ్రవరి 15 వరకు ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న తెలిపారు. ధాన్యం విక్రయానికి సిద్ధంగా ఉన్న రైతులు సమీపంలోని రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. మొదటి రకం ధాన్యానికి క్వింటాకు రూ.2,060, సాధారణ రకం ధాన్యానికి రూ.2,040 వంతున రైతుల ఖాతాలకు నేరుగా చెల్లించనున్నట్లు చెప్పారు. అలాగే రబీలో పండించే నువ్వులు, పొద్దుతిరుగుడు, జీలుగ, పచ్చిరొట్ట తదితర పంటలను ఈ–పంటలో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ–పంట నమోదులో తమ సిబ్బందికి సహకరించాలని రైతులను కోరారు.

కోడి పందాల్లో ఇద్దరు అరెస్టు

కోటవురట్ల : మండలంలోని తీడ గ్రామంలో గురువారం కోడి పందాలు ఆడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.1500 నగదు, రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. అరెస్టయిన వారిలో కనితి ఈశ్వరరావు, అడిగట్ల సూరిబాబు ఉన్నట్టు పేర్కొన్నారు.

డైట్‌లో ప్రాంగణ నియామకాలు



ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్, బ్యాంకు అధికారులు

అనకాపల్లిటౌన్ : స్థానిక డైట్ కళాశాల ఆవరణలో గురువారం ఐసీఐసీఐ బ్యాంకు హెచ్‌ఆర్ బృందం ఎంబీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాంగణ నియామకాలు చేపట్టింది. బ్యాంకు అధికారులు విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు 30 మంది విద్యార్థులు హాజరుకాగా 12 మంది విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ చల్లా నర్సింహం తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 2,374 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,420	3,830
మొదటి రకం	2,930	3,400
రెండో రకం	2,890	3,170
మూడో రకం	2,700	2,840

అనకాపల్లి సినిమాలు

ధమాకా	- రాజా
వాల్తేరు వీరయ్య	- సత్యనారాయణ స్క్రీన్-1
వీర సింహారెడ్డి	- సత్యనారాయణస్క్రీన్-2
18 పేజెస్	- షిర్డిసాయి
వాల్తేరు వీరయ్య	- పర్తిసాయి
వీర సింహారెడ్డి	- వెంకటేశ్వర
లవ్ టుడే	- శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	- రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 66 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–16 యూనిట్లు, ఏ నెగిటివ్–3 యూనిట్లు, బీ పాజిటివ్–4 యూనిట్లు, బీ నెగిటివ్–2 యూనిట్లు, ఓ పాజిటివ్–39 యూనిట్లు, ఏబీ పాజిటివ్–2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ ప్రతినిధి గంగయ్య(9182834480)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 533 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 487 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

పురుగు మందుల పిచికారీలో జాగ్రత్త


పురుగు మందును నీటిలో కలుపుతున్న రైతు


పురుగు మందును పిచికారీ చేస్తున్న రైతు(ఫైల్)

- పూర్తి స్థాయి రక్షణ తప్పనిసరి
- వ్యవసాయాధికారుల సూచన

అనకాపల్లి రూరల్: పంట పొలాల్లో పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణానికే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే అనారోగ్యం పాలవుతారు. ప్రస్తుతం రబీ సీజన్ సాగులో ఉన్న సాధారణ, ఉద్యాన పంటలతో పాటు కూరగాయలు, ఆకుకూరల పంటల కోసం రైతులు విస్తృతంగా పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు. నిర్లక్ష్యరాస్యులైన కొందరు రైతులు అవగాహన లోపంతో అనారోగ్యం పాలవుతున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే ముప్పు తప్పించుకోవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

రక్షణ చర్యలు తప్పనిసరి

పురుగు మందుల పిచికారీ సమయంలో రక్షణ దుస్తులు ధరించడం తప్పనిసరి. కాళ్లు, చేతులు పూర్తిగా కప్పి ఉంచేలా చొక్కా, ఫ్యాంట్ ధరించాలి. ముఖానికి మాస్కు లేదా రక్షణ వస్త్రం కట్టుకోవడం మంచిది. కళ్లకు అద్దాలు పెట్టుకోవడం మేలు. మందులు కలిపేటపుడు చేతులకు గ్లౌవ్స్ ధరించాలి. నీటిలో మందును వేశాక చేతులతోకంటే.. కర్రతో కలపడం మంచిది.

అప్రమత్తంగా ఉంటే మేలు

ముందుగా డ్రమ్ముల్లో లేదా బకెట్లలో మందు కలిపిన తర్వాతనే స్ప్రేయర్లలో నింపి, పిచికారీ చేయాలి. అనుభవం కలిగిన వ్యవసాయ, ఉద్యాన అధికారుల సూచనల మేరకు తగిన మోతాదులో పురుగు మందులను వినియోగించాలి. రసాయన మందులను ఇంట్లో పిల్లలకు దూరంగా భద్రపరచాలి. సాధ్యమైనంత వరకు పంట పొలాల వద్దే ఉంచడం మేలు. ముందుగా పురుగు మందు డబ్బాల మీద గడువు తేదీని గుర్తించాలి. మందు సీసాల మూతలను ఎట్టి పరిస్థితుల్లోనూ నోటితో తీయకూడదు. స్ప్రేయర్ నాజిల్‌కు ఏదైనా అడ్డు తగిలినట్లయితే నోటితో తీయడం ప్రమాదకరం. రెండు మూడు రకాల మందులను వాడేటప్పుడు అవి కలిసిపోయే తత్వాన్ని గమనించిన తర్వాతనే పిచికారీ చేయాలి. మందు పిచికారీ చేసేటపుడు ఆకులపైన, కింది భాగంలో తడిసేలా ఆధునిక స్ప్రేయర్లను ఉపయోగించాలి.

నీటిలో కలిపేటపుడు అప్రమత్తం



రైతులు పురుగు మందుల వినియోగంలో తగు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. తగు మోతాదులో మాత్రమే పురుగు మందులను వాడాలి. ఈ విషయంలో సమీపంలో వ్యవసాయాధికారి లేదా శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవాలి. అలాగే కాలపరిమితి దాటిన పురుగు మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించరాదు. గాలికి ఎదురుగా పిచికారీ చేయటం మంచిది కాదు. పురుగు మందుల్లో ఉప్పు నీటిని వాడరాదు. ఉదజని సూచిక 8కి మించి ఉన్న, 5కి తక్కువ ఉన్న నీటిని వినియోగించరాదు.

– ఎం.రామారావు, ఏడీ, వ్యవసాయ సబ్ డివిజన్, అనకాపల్లి

సమస్య ఏదైనా.. పరిష్కారం సత్వరం


మంత్రి అమర్‌నాథ్‌తో కలిసి నడుస్తున్న వృద్ధురాలు గంతకూర వెంకాయమ్మ

- గణేష్ నగర్లో రూ.25 లక్షలతో రక్షిత మంచినీరు
- గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా సమస్యల తక్షణ పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్యశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. అనకాపల్లి మండలం అక్కిరెడ్డిపాలెం పంచాయతీ తారకరామారావు కాలనీ, గణేష్‌నగర్, శీరంశెట్టిపాలెంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం ప్రారంభమయింది. తొలుత తారకరామారావు కాలనీలో కామాక్షమ్మవారిని మంత్రి దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీ కేంద్రం మరమ్మతు పనుల్ని పరిశీలించారు. మంత్రితోపాటు ఎంపీ బీవీ సత్యవతి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకున్నారు. ఎవరెవరికి ఏ మేరకు లబ్ధి చూకూరిందో వివరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీస్తూ, వాటి తక్షణ పరిష్కారానికి సంబంధిత అధికారుల్ని ఆదేశించారు.

ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మరింత అభివృద్ధి, మరిన్ని సంక్షేమ పథకాలు అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని తెలిపారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారికి తక్షణమే అందజేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయలను కల్పించడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని ఆరోపించారు. సమస్య ఏదైనా తమ ప్రభుత్వం దృష్టికి రాగానే వెంటనే పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. తారకరామారావుకాలనీ, గణేష్‌నగర్, శీరంశెట్టిపాలెం గ్రామంల్లో డ్రైనేజీ సమస్య ఎక్కువగా ఉందని స్థానికులు మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో, కాలువల నిర్మాణానికి సీఎం జగన్‌మోహన్ రెడ్డితో మాట్లాడి ప్రత్యేకంగా నిధులు కోరనున్నట్టు పేర్కొన్నారు. గణేషనగర్‌లో రూ.25 లక్షలతో రక్షిత మంచినీటి పథకం కింద ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించడానికి అవసరమైన చర్యలు చేపట్టనున్నట్టు వెల్లడించారు.

అనంతరం తారకరామారావుకాలనీలో కామాక్షమ్మ ఆలయ కమిటీ సభ్యులు గజమాలతో మంత్రి అమర్‌నాథ్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గంగాధరరావు, వెలుగు ఏపీఎం కె.నీలాచలం, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, అక్కిరెడ్డిపాలెం సచివాలయం కన్వీనర్లు నారిపిన్ని ప్రసాద్, మామిడి ధనలక్ష్మి, శీరంశెట్టి అప్పలరాజు, పార్టీ నేతలు బోయినపల్లి వెంకటరఘు, ఎ.రాజశేఖర్, బొండా అప్పారావు, సాలపు రెడ్డి నరసింగరావు, ఈగల రామునాయుడు, వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.


గడప గడపకూ మంత్రి అమర్‌నాథ్‌తో ఎంపీ సత్యవతి

పాఠశాల సమస్యలపై ప్రత్యేక దృష్టి

హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్ల సమావేశంలో అధికారులు


మాట్లాడుతున్న ఎంఈవో చిట్టిబాబు

కోటవురట్ల : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో మెనూ పక్కాగా అమలు చేసి, నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని ఎంఈవో చిట్టిబాబు ప్రధానోపాధ్యాయుల్ని కోరారు. కోటవురట్ల మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లతో గురువారం సమావేశమయ్యారు. మధ్యాహ్న భోజన పథకం, పాఠశాలల్లో సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం మెనూ అమలును బాధ్యతగా తీసుకోవాలన్నారు. సమస్యలను తన దృష్టికి తీసుకు వస్తే, ఉన్నతాధికారులకు నివేదించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా బీసీ, సమగ్ర బాలికల వసతి గృహాల్లో సమస్యలపై ప్రత్యేకంగా చర్చించారు. ఆయా పాఠశాలల్లో సమస్యలను హెచ్‌ఎంలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తాళ్లపాలెం హైస్కూలు ప్రహరీ ఎత్తు తక్కువగా ఉండటం వల్ల స్థానికులు పాఠశాలలోకి ప్రవేశించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని, అక్కడి గురుకుల పాఠశాల మురుగునీరు బయటికి రావడంతో స్థానికులు అభ్యంతరం చెబుతున్నారని, తేగాడలోని కస్తూర్బా విద్యాలయంలో బోరు పని చేయడం లేదని పేర్కొన్నారు. ఎంపీడీవో కొంకి అప్పారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, హెచ్‌ఎంలు ఎ.శ్రీధర్‌రెడ్డి, ఎం.ఎస్.స్వర్ణకుమారి, జి.వి.కె.ఆచారి, టీవీఆర్ పద్మాకర్, ఎస్ఎస్ రామ్‌ప్రసాద్, కె.కృష్ణారావు, ఎం.రమణశ్రీ, పి.భాస్కరరావు, తాళ్లపాలెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మళ్ల మాణిక్యం, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.అనిత, కస్తూర్బా ప్రిన్సిపాల్ డి.చంద్రకళ, ఏఎస్‌డబ్ల్యూ వి.సత్యవతి, హెచ్‌డబ్ల్యూవోలు పి.నిర్మల, పీకేవీ నారాయరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తీర్థ మహోత్సవాలు

కోటవురట్ల : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం తీర్థ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. తీడ, గొట్బూరు, జోగారావుపేట గ్రామాల్లో తీర్థ మహోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. తిను బండారాలు, ఆట వస్తువుల అమ్మకాలు జోరుగా సాగాయి. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

క్యాలండర్, డైరీ ఆవిష్కరణ


డైరీలను ఆవిష్కరించిన సీపీవో రామారావు

తుమ్మపాల : అర్థ గణాంక, ప్రణాళిక శాఖ సబార్డినేట్ అసోసియేషన్ 2023 క్యాలండర్, డైరీలను జిల్లా అర్థగణాంక, ప్రణాళిక శాఖ అధికారి జి.రామారావు గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ సంచాలకులు కె.చంద్రశేఖర్, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.వైకుంఠరావు, డిప్యూటీ గణాంక అధికారి జి.రాజేశ్వరరావు పాల్గొన్నారు.

‘బీజేపీ ప్రజా వ్యతిరేక పాలనపై ప్రచారం’


సమావేశంలో మాట్లాడుతున్న భానుమూర్తియాదవ్

అనకాపల్లిటౌన్ : రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ఈ నెల 30న జమ్మూకాశ్మీర్లో ప్రవేశిస్తుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోయిన భానుమూర్తియాదవ్ తెలిపారు. పార్టీ సీనియర్ నాయకుడు పి.ఎస్.దత్తు గృహంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 26 నుంచి మార్చి 26 వరకు హాత్ సే హాత్ జోడోయాత్ర స్ఫూర్తితో ప్రతి నియోజకవర్గంలో ఎనిమిదేళ్లుగా బీజేపీ చేస్తోన్న ప్రజా వ్యతిరేక పాలనను ప్రజలందరికీ వివరించాలని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి కత్తెర శ్రీధర్, మండల అధ్యక్షుడు కాళ్ల వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

గణపర్తిలో సంపద తయారీ కేంద్రం


సంపద తయారీ కేంద్రంలో వానపాములను విడుదల చేస్తున్న సిబ్బంది

మునగపాక : అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి దత్తత గ్రామం గణపర్తిలో సంపద తయారీ కేంద్రం అందుబాటులోకి వచ్చింది. కొంత కాలంగా సంపద తయారీ కేంద్రం వినియోగంలోకి రాకపోవడంతో పంచాయతీకి ఆదాయ వనరులు కనిపించేవి కావు. సమస్యను గుర్తించిన ఎంపీ డాక్టర్ సత్యవతి ప్రత్యేక దృష్టి సారించారు. అనకాపల్లి జిల్లా డీపీవో శిరీషారాణి గ్రామంలో పర్యటించి తడి,పొడి చెత్త తయారీ కేంద్రం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. పంచాయతీ పాలకవర్గాన్ని కూడా ఆమె అప్రమత్తం చేశారు. దీంతో సంపద తయారీ కేంద్రం అందుబాటులోకి రావడం అలాగే వానపాములను విడుదల చేసే కార్యక్రమం గురువారం నిర్వహించారు. సర్పంచ్ చదరం నాయుడు, కార్యదర్శి బుజ్జిబాబు తదితరుల చొరవ కారణంగా సంపద తయారీ కేంద్రం అందుబాటులోకి వచ్చింది. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్రీడలతో ఆనందం.. ఆరోగ్యం


కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీడీవో రమేష్ నాయుడు

సబ్బవరం: క్రీడలు యువతలో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఎంపీడీవో రమేష్‌నాయుడు తెలిపారు. మండలంలోని ఇరువాడ గ్రామంలో కొలువైన సీతారాముల తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఏర్పాటు చేసిన మండల స్థాయి కబడ్డీ పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో మండలంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన 16 జట్లు పాల్గొన్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.8 వేలు నగదు బహుమతితో పాటు జ్ఞాపికలను అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బలిరెడ్డి కనకరాజు, సంద్రాన అప్పారావు, బలిరెడ్డి అప్పారావు, గుజ్జా శ్రీను, పంచాయితీ కార్యదర్శి లతకుమారితో పాటు పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


వెదుళ్లనరవ, సబ్బవరం జట్ల మధ్య రసవత్తర పోరు

బాల్య వివాహాలను అరికట్టాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్

మునగపాక : బాల్య వివాహాలను అరికట్టాలని ఎంపీడీవో పి.రవికుమార్ కోరారు. మునగపాక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సాయంత్రం స్వాభిమాన్ కార్యక్రమంలో భాగంగా మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, వెలుగు సిబ్బంది, ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తహీనత లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే 10 నుంచి 19 సంవత్సరాల బాలికలకు ఎదురయ్యే సమస్యలపై అవగాహన ఇవ్వాలన్నారు. వారిలో వచ్చే మార్పులను గమనిస్తూ ఉండాలన్నారు. మహిళల్లో రక్తహీనత కారణంగా ఆరోగ్య సమస్యలు వస్తాయని, ఇందుకోసం వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలన్నారు. గ్రామాల్లో సభలు నిర్వహించాలన్నారు. డీసీవో లిఖిత, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, తహసీల్దార్ బాబ్జీ, చూచుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్తేర్‌రాణి, సీహెచ్‌వో ప్రవళిక, ఈవోఆర్డీ ఈశ్వరరావు, వెలుగు ఏపీఎం కొండమ్మ పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

అనకాపల్లిటౌన్ : మండలంలోని మామిడిపాలెం, కోడూరు, సీహెచ్ఎన్ అగ్రహారం, దిబ్బపాలెం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం రూరల్ ఎస్ఐ నరసింగరావు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలకు ఎవరైనా పాల్పడితే విద్యార్థులు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, అందుకు ప్రోత్సహించే తల్లిదండ్రులపై కూడా చర్యలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్య శిబిరానికి స్పందన


రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు నాయుడు

అనకాపల్లిటౌన్ : స్థానిక శ్రీధర్ లాడ్జి దరి వెంకటేశ్వర నర్సింగ్ హోంలో గురువారం మెడికవర్, వాకర్స్ క్లబ్‌లు సంయుక్తంగా ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రముఖ హృద్రోగ నిపుణుడు డాక్టర్ డి.డి.నాయుడు 70 మంది రోగులను పరీక్షించారు. అవసరమైన పరీక్షలు నిర్వహించి, తీవ్ర సమస్యలున్నవారిని గుర్తించారు. అవసరమైన మందులు అందించారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ వైద్యులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మంచినీటి బోరు ఏర్పాటు


సాలాపువానిపాలెంలో మంచినీటి బోరు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

పరవాడ: జీవీఎంసీ 84వ వార్డు సాలాపువానిపాలెం గ్రామ ప్రజల దాహార్తి తీర్చడానికి వీలుగా పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ బోర్‌వెల్ మంజూరు చేయించారు. గ్రామానికి మంజూరైన బోర్ వెల్ నిర్మాణ పనులను గురువారం పూర్తి చేశారు. ఈ ప్రాంత ప్రజల నీటి ఎద్దడి తీర్చడానికి మంచినీటి బోరు ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మంచినీటి బోరు నిర్మాణ పనుల కార్యక్రమంలో స్థానిక సచివాలయ కన్వీనర్లు సాలాపు సంతోష్, శ్రీను, గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు రాజు, అప్పలరాజు, దొరబాబు, రామకృష్ణ, నూకరాజు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

‘ఉగాది నాటికి జగనన్న ఇళ్లు పూర్తి కావాలి’


సమీక్షలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి కిరణ్ కుమారి

సబ్బవరం: ఉగాది నాటికి నిర్దేశించిన మేరకు జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను శత శాతం పూర్తి చేయడమే లక్ష్యంగా సిబ్బంది పని చేయాలని మండల ప్రత్యేక అధికారి కిరణ్‌కుమారి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని పలు శాఖల పనితీరుపై ఆయా శాఖల అధికారులతో గురువారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాల పురోగతిపై గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్షించామన్నారు. ఉగాది నాటికి మండలంలోని పలు జగనన్న కాలనీల్లో 698 గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వీటిలో ఇప్పటికే 50 శాతం గృహ నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలిన వాటిని పూర్తి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకుని పని చేస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నాడు–నేడుతో పాటు అన్ని ప్రభుత్వ కార్యక్రమాల పురోగతిపై విస్తృతంగా సమీక్షించామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ నాయుడు, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, ఈవోపీఆర్‌డీ మహేష్, ఎవోఎస్. బాబురావు, మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణతో పాటు పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తహీనత పట్ల అప్రమత్తం


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీవో హేమసుందరరావు

పరవాడ: రక్తహీనత పట్ల బాల బాలికలు అప్రమత్తంగా ఉండాలని పరవాడ ఎంపీడీవోవి.హేమ సుందరరావు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో స్వాభిమాన్ కార్యక్రమంలో భాగంగా బాలబాలికలు, మహిళల్లో సోకే రక్తహీనతపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం సీడీపీవో లలితకుమారి మాట్లాడుతూ బాలబాలికల్లో వచ్చే రక్తహీనత, బాల్య వివాహాలు, పౌష్టికాహారం గురించి వివరించారు. రక్తహీనత నివారణపై గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధులు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ విస్తరణాధికారి పద్మజ, మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.